ప్రజాశక్తి
శనివారం 3 జనవరి, 2026 8 పేజీలు
శ్రీకాకుళం



గోధుమపిండి పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సామాన్యులకు అందుబాటులోకి నిత్యావసర సరుకులు తీసుకొస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని పెద్దరెల్లి వీధిలో రేషన్ డిపో ద్వారా కార్డుదారులకు రూ.20కే కిలో గోధుమపిండిని అందజేశారు. సామాన్యులకు అందుబాటులో నిత్యావసర సరుకులు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఏడాదిలోగా లోపరహితంగా రీ సర్వే పూర్తి చేస్తాం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ ప్రారంభం



పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి, శ్రీకాకుళం

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని అక్కయ్యవలసలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని, ప్రభుత్వానికి అందుతున్న వినతుల్లో 90 శాతం ఈ శాఖకు సంబంధించినవే ఉన్నా యన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వే తప్పుల తడకగా మారిందని, వేలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏడాది లోగా ఎటువంటి తప్పుల్లేకుండా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. కొత్త పాస్ పుస్తకాల మంజూరులో ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సవరిస్తామని హామీనిచ్చారు. గత పాలకుల వలె పుస్తకాలపై, సర్వే రాళ్లపై ఫొటోలు వేసుకోకుండా, అధికారిక రాజముద్రతో వీటిని అందజేస్తున్నామని తెలిపారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో చెన్నైలో ముద్రించిన ఈ- పాస్‌పుస్తకాలను పాస్‌పోర్టు తరహాలో నేరుగా రైతుల ఇంటికే పోస్టల్ ద్వారా పంపేలా భవిష్యత్తులో ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. పుస్తకంలోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే (మిగతా...2)

6 నుంచి 'కార్గో' గ్రామాల్లో మట్టి పరీక్షలు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ వెంకటేష్

ప్రజాశక్తి - మందస

కార్గో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో ఈనెల 6 నుంచి పదో తేదీ వరకు రైట్స్ సంస్థ ప్రతినిధులు పర్యటించి మట్టి పరీక్షలు చేయనున్నారని కార్గో ఎయిర్‌పోర్టు ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ వెంకటేష్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మట్టి పరీక్షలకు రైతులు సహకరించాలని కోరారు. గ్రామసభలు నిర్వహించిన అనంతరం ప్రజాభిప్రాయం మేరకే కార్గో ఎయిర్‌పోర్టుపై ముందుకెళ్తామన్నారు.

కార్గో ఎయిర్‌పోర్టుకు సంబంధించి 1400 ఎకరాలను సేకరించి, అందులో 300 ఎకరాలను అభివృద్ధి చేసి బాధితులకు అందజేస్తామన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం, ఆర్‌ఆర్ ప్యాకేజీ కూడా అందిస్తామని తెలిపారు. నష్టపోయిన కొబ్బరి, జీడి, మామిడి, పనస చెట్లకు అధికారులతో నోటిఫైడ్ చేసి, ప్రతి చెట్టుకూ అదనంగా పరిహారం ఇస్తామన్నారు. సమావేశంలో తహశీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



సిద్ధం చేసిన సభా వేదిక

నేడు 'అభ్యుదయం' ముగింపు

హోంశాఖ మంత్రి అనిత రాక

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా పాయకరావుపేటలో ప్రారంభించిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర' శనివారం ఇచ్ఛాపురంలో ముగియనుంది. పట్టణంలోని సురంగి రాజా క్రీడా మైదానంలో సైకిల్‌యాత్ర ముగింపు సభకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముగింపు సభకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, హోంశాఖ మంత్రి వి.అనిత, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తదితరులు హాజరు కానున్నారు. సైకిల్‌యాత్రకు గుర్తుగా పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను హోం మంత్రి అనిత ప్రారంభించనున్నారు. సురంగిరాజా మైదానంలో ఏర్పాట్లను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పరిశీలించారు. బహిరంగ సభ వేదిక వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎఎన్‌ఎం ఉద్యోగోన్నతుల్లో అవకతవకలు

వైద్యారోగ్య కమిషనర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా వైద్యారోగ్యశాఖలో ఎఎన్‌ఎం ఉద్యోగోన్నతుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్‌కు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి శుక్రవారం ఫిర్యాదు (మిగతా...2)



వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న వాబ యోగి

రైతుల మేలు కోసమే భూ రీ సర్వే

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గార

రైతుల మేలు కోసమే భూ రీ సర్వే చేస్తున్నామని, ఈ సర్వే ద్వారా అన్ని భూ సమస్యలు పరిష్కారం కావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గార మండలం అంపోలులో శుక్రవారం నిర్వహించిన రీ సర్వే ప్రారంభోత్సవ ర్యాలీలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి శుక్రవారం పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా భూ సమస్యల పరిష్కారానికి ప్రజలు ప్రభుత్వం వద్దకు వెళ్లే విధంగా కాకుండా.. ఈసారి భిన్నంగా ప్రజల వద్దకే ప్రభుత్వం వచ్చే ఏర్పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేశారని చెప్పారు. జిల్లాను అభివృద్ధి చేయాలని అధికార (మిగతా...2)

మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ, కవిటి, కంచిలి

జిల్లాలో వేలాది మంది ప్రయాణికుల సౌలభ్యం కోసం రైల్వేశాఖ... మూడు రైల్వేస్టేషన్లలో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టులు మంజూరు చేసిందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. తిలారు రైల్వేస్టేషన్‌లో బెర్హంపూర్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో పూరి-అహ్మదాబాద్ ఎక్స్‌ప్రెస్, బారువ రైల్వేస్టేషన్‌లో భువనేశ్వర్-న్యూ విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ హాల్టుకు అనుమతిస్తూ రైల్వేశాఖ ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ రైళ్ల నిలుపుదల త్వరలోనే అమల్లోకి వస్తుందని తెలిపారు. ఈ నిర్ణయం జిల్లాకు మెరుగైన రైలు సౌకర్యాలు, అభివృద్ధి దిశగా వేసిన ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇచ్ఛాపురం, బారువ రైల్వేస్టేషన్లలో రెండు రైళ్లకు హాల్ట్ కల్పించిన సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు జెడ్‌ఆర్‌యుసిసి సభ్యులు శ్రీనివాస రౌలో, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరాడ (మిగతా...2)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

నిరుద్యోగ యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని పియుసి ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమర్‌రాజా కంపెనీ, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగంలోనూ అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. చదువుతో పాటు సాంకేతిక (మిగతా...2)

రేపు బహిరంగ సభకు తరలిరావాలి



ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - హిరమండలం

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సిఐటియు అఖిల భారత మహాసభల్లో భాగంగా ఈనెల నాలుగో తేదీన నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు, ఐలు జిల్లా కార్యదర్శి ఎం.అప్పారావు, మండల కన్వీనర్ పల్ల కృష్ణ పిలుపునిచ్చారు. హిరమండలం మండల కేంద్రంలో సిఐటియు అఖిల భారత మహాసభల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగో తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రదర్శన అనంతరం మున్సిపల్ స్టేడియంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్‌లు ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ము కాసి కార్మిక ఉద్యమాలను అణచివేస్తున్నాయని, కార్మికుల ఏ (మిగతా...2)



నార సంచులను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్

పర్యావరణ పరిరక్షణకు నార సంచులే మేలు

ప్రజాశక్తి - రణస్థలం

ఒక్కసారి వాడి పారేసే పాలిథిన్, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే దిశగా ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో జగ్గయ్యపేటకు చెందిన హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ సిద్ధం చేసిన నార సంచులను శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిథిన్, ప్లాస్టిక్ మట్టిలో కలియడానికి చాలా ఏళ్లు పడుతుందని, పైగా అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతుందన్నారు. వీటి వాడకాన్ని వీలైనంత వరకూ తగ్గించే దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలిథిన్ సంచులు వినియోగించడం వల్ల గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోవడమే కాక, వాటి వల్ల పశు పక్ష్యాదులు మృత్యువాత పడుతున్నాయని హరిత సొసైటీ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత, పాలిథిన్, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి, నార సంచుల వినియోగం వలన కలిగే ప్రయోజనాల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించడానికి తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో హరిత సొసైటీ కార్యదర్శి పతివాడ తవిటినాయుడు, కోశాధికారి కలిశెట్టి ఆదినారాయణ, గౌరవ సభ్యులు కెంబూరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సహాయకులు

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని ఉన్న రత్తకన్నలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోంపేట ఆరోగ్య వరం కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, ఏడుగురికి శస్త్రచికిత్సలు అవసరంగా గుర్తించారు. మరో ఎనిమిది మందికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చిడిపోతూ జగన్, వైద్య సహాయకులు కిరణ్, ఎం. శరత్, ఎన్.సురేష్, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- అరసవల్లి

ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామిని శుక్రవారం గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సునీతా అగర్వాల్ దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి కెఎన్‌విడివి ప్రసాద్ ఘనంగా స్వాగతం పలికి వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు.

సహకార వ్యవస్థ బలోపేతమే లక్ష్యం



ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నాబార్డు సంస్థ బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలకు రుణాలు అందజేయడమే కాకుండా సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తోందని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి కె.రమేష్‌కృష్ణ అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సర వేడుకల్లో భాగంగా నగరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో నాబార్డు నిర్వహించిన రాష్ట్రస్థాయి సహకార సదస్సు, ప్రదర్శన శుక్రవారం ముగిసింది. చేనేత సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన 15 స్టాళ్లతో మూడు రోజుల పాటు ప్రదర్శన నిర్వహించారు. పొందూరు ఖాదీ, కుప్పడం చీరలు, కలంకారీ, జమ్దానీ డ్రెస్ మెటీరియల్స్, జనపనార ఉత్పత్తులు, సముద్రపు గవ్వల హస్తకళలు, చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులు, చేనేత హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శనలు నిర్వహించారు. ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ, శిక్షణ, సామర్థ్య పెంపుదల వంటి కార్యక్రమాల ద్వారా సహకార వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని సహకార సంఘాలకు నాబార్డు రూ.11 వేల కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించిందని వెల్లడించారు. పొందూరు ఖాదీకి భౌగోళిక గుర్తింపు రావడం జిల్లాకు గర్వకారణమన్నారు. ముంబైలోని కెవిఐసి వద్ద అధికారిక వినియోగదారులుగా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా డ్వాక్రా బజారు నిర్వహణ కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు నాబార్డు రూ.11.25 లక్షల గ్రాంట్ మంజూరు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చేనేత శాఖ సహాయ సంచాలకులు టి.జనార్ధనరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.శ్రీనివాసరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నేత కార్మికులు, రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) ఒక వరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 29 మంది, మరో ఇద్దరు లబ్ధిదారులకు కలిపి రూ.17,22,027 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టెక్కలి నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు 254 దరఖాస్తులు రాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో 218 మందికి రూ.2,39,71,485 విలువైన చెక్కులను మంజూరు చేయించగలిగామని వివరించారు. కోటబొమ్మాళిలో 68 మందికి రూ.71.19 లక్షలు, సంతబొమ్మాళిలో 79 మందికి రూ.98.99 లక్షలు, టెక్కలి మండలంలో 30 మందికి రూ.30.62 లక్షలు, నందిగాం మండలంలో 41 మందికి రూ.38.89 లక్షల మేర సాయం అందిందని తెలిపారు. మరో 12 దరఖాస్తులు పది రోజుల్లో సిద్ధమవుతాయని, ఇటీవల పంపిన మరికొన్ని దరఖాస్తులు ముఖ్యమంత్రి కార్యాలయంలో పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో సిఎం సహాయనిధిని పొందేందుకు ఎన్నో ఆంక్షలు ఉండడంతో, నిరుపేదలు ఇబ్బందులు పడ్డారు. గత పాలనలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎంతో ఉదారంగా స్పందిస్తూ ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తోందన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందడమే కాకుండా, వారి ఆర్థిక ఇబ్బందులు తొలగించేలా కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, సర్పంచ్ రావాడ రాజేష్, కురుడు పంచాయతీ ఇన్‌ఛార్జి ఎన్.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

భూమి వివరాలన్నీ కనిపిస్తాయని, యజమానికి తెలియకుండా ఎవరైనా రికార్డులను టాంపర్ చేయాలని చూస్తే వెంటనే మొబైల్‌కు అలర్ట్ వచ్చేలా భద్రత కల్పిస్తున్నామన్నారు. టెక్కలి ప్రాంతంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రభుత్వ భూముల కబ్జాలపై దర్యాప్తు జరుగుతోందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అక్కయ్యవలస గ్రామానికి రోడ్డు వెడల్పు చేస్తామని, పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కింజరాపు హరిప్రసాద్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్, పిఎసిఎస్ అధ్యక్షులు వి.విజయలక్ష్మి, రోణంకి లీలామోహన్, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైతుల భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, ఎటువంటి అవకతవకలకు తావులేకుండా క్యూఆర్ కోడ్, బయోమెట్రిక్ విధానం ద్వారా కొత్త పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి గ్రామంలోని 911 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఇప్పటికే 22-ఎ భూ సమస్యలను పరిష్కరించామని, రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆన్‌లైన్ రశీదులతో పాస్ పుస్తకాలు ఇస్తున్నామని తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో ఇప్పిలిలో మరోసారి రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, తహసీల్దార్ గణపతి, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎఎన్ఎం ఉద్యోగోన్నతుల్లో అవకతవకలు

చేశారు. జిల్లాలో అర్హులైన 541 మంది ఎఎన్ఎంలకు గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2 ప్రమోషన్ కల్పించేందుకు లక్షలాది రూపాయలను వసూలు చేసి అడ్డగోలుగా మెరిట్ జాబితా తయారు చేశారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సక్రమమైన పద్ధతిలో సీనియారిటీ జాబితా రూపొందించాలని కోరారు. జిఒ నంబరు 68, బ్యాక్‌లాగ్ ద్వారా నియమితులైన వారందరినీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ పరిగణనలోకి తీసుకోకుండా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ సైకిల్ ద్వారా ఆదివాసీలకు

మొదటిపేజీ తరువాయి

రాజ్యాంగం కల్పించిన ఆరు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. తద్వారా అర్హులైన తొమ్మిది మంది ఆదివాసీ అభ్యర్థులకు ఉద్యోగోన్నతులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు జి.అప్పన్న, మెళియాపుట్టి మండల అధ్యక్షుడు ఎస్.గణేష్ తదితరులు ఉన్నారు.

రైతుల మేలు కోసమే భూ రీ సర్వే

యంత్రాంగం శ్రమిస్తున్నా.. వారికి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు సవాల్ విసురుతున్నాయన్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేలా ప్రజలు సైతం సహకారం అందించాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో భూ సర్వే పేరుతో అనేక తప్పులు జరిగాయని ఆరోపించారు. భూమికి సంబంధించిన రైతుకు సమాచారం లేకుండా, ఊరికి సమాచారం లేకుండా.. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా 20 రోజుల్లో హడావుడిగా చేసి అనేక తప్పులకు ఆస్కారం ఇచ్చారని తెలిపారు. గత సర్వే నుంచి ఉపశమనం అందిస్తూ.. 182 రోజుల వ్యవధితో సుదీర్ఘంగా చేపడుతున్న ఈ సర్వే రైతులకు ఉపశమనం అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భూ సర్వే కోసం అధునాతన సాంకేతికతను వాడుతున్నామని తెలిపారు. సంబంధిత భూ యజమానికి పూర్తి సమాచారం అందిస్తూ సర్వే సాగుతుందని స్పష్టం చేశారు. నాలుగో విడత భూ సర్వేలో జిల్లాలో 200 గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అంపోలులో ఆలయ భూముల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

పరిజ్ఞానం ఎంతో అవసరమని, శిక్షణా కార్యక్రమాలు యువత భవిష్యత్‌కు బాటలు వేస్తాయన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పారిశ్రామికవేత్తలపై అవలంభించిన తీరుతో రాష్ట్రాన్ని విడిచి చాలా పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు పలు రాయితీలను అందించడంతో పలు పరిశ్రమలు రాష్ట్రానికి తరలివస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలను యువతకు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే నాలుగు జాబ్ మేళాలు నిర్వహించామని, మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పట్టణంలో అమర్‌రాజా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ మేళాలో పెద్దసంఖ్యలో యువత పాల్గొని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూన వెంకట రాజ్యలక్ష్మి, టిడిపి నాయకులు సనపల ఢిల్లేశ్వరరావు, ఎస్.మురళి, ఎ.భాస్కరరావు, మురళీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు

చంద్రమోహన్, మండల అధ్యక్షులు మద్దు కుమార్, బారువ రైల్వే సాధన కమిటీ అధ్యక్షులు రాంబుడ్డి గణపతి, ప్రధాన కార్యదర్శి రత్నాల శ్రీనివాసరావు, సిహెచ్.ధర్మారావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు బహిరంగ సభకు తరలిరావాలి

ఒక్క సమస్యనూ పరిష్కరించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. అసమానతలు, పేదరికం ఎన్నడూ లేని స్థాయికి చేరాయన్నారు. విశాఖపట్నంలో నిర్వహిస్తున్న అఖిల భారత మహాసభలు కార్పొరేట్ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించబోతున్నాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు బాలరాజు, సిర్ల ప్రసాదరావు, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
శనివారం 3 జనవరి 2026

మన్యంలో కార్మిక వర్గానికి అండగా సిఐటియు

అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో వివిధ కార్మిక, శ్రామిక వర్గాలకు సిఐటియు అండగా నిలిచింది. గత రెండున్నర దశాబ్దాలుగా వారి మనుగడ కోసం అనేక పోరాటాలతో ముందు సాగింది. ఈ ప్రాంతంలోని 20కి పైగా కార్మిక, ఉద్యోగ సంఘాలతో సిఐటియు అనుబంధం పెనవేసుకుంది. ఎర్ర జెండా సాక్షిగా అనేక సమరశీల పోరాటాలతో కార్మిక వర్గాల్లో ఐక్యతను సాధించి వారికి వెన్నుదన్నుగా నిలిచింది.



ప్రదర్శన చేపడుతున్న సిఐటియు నాయకులు, సిహెచ్‌డబ్ల్యులు (ఫైల్)

ప్రజాశక్తి - పాడేరు

పాడేరు ఏజెన్సీలో 1998- 99లో కార్మిక వర్గాలకు అండగా సిఐటియు ఆవిర్భవించింది. అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గోపాలపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అరకు లోయలోని పద్మాపురం కొత్తవలస గార్డెన్స్‌లో ఐటిడిఎ (హెచ్‌ఎన్‌టిసి) డైలీ వేజ్ కార్మికుల సంఘానికి అనుబంధంగా సిఐటియు ప్రస్థానం మన్యంలో మొదలైంది. అప్పట్లో 40 మంది డైలీ వేజ్ కార్మికులు ఈ హెచ్‌ఎంటిసిలో పనిచేసేవారు. వీరికి కిల్లో అప్పన్న అనే గిరిజన కార్మికుడు.. సిఐటియు తరపున నాయకుడిగా వ్యవహరించారు. ఆ తరువాత సిఐటియు అంచలంచెలుగా అనేక కార్మిక, శ్రామిక వర్గాలకు అండగా నిలిచి సమరశీల పోరాటాలతో మరింత చేరువయ్యింది. మినుములూరు, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో కాఫీ కార్మికులకు అండగా నిలిచి 2001-02 సంవత్సరంలో సిఐటియు చేపట్టిన కాఫీ ఉద్యమంతో వారికి గట్టి భరోసా కల్పించింది. ఈ క్రమంలో ఏజెన్సీలోని అంగన్వాడీ, ఆశా వర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తల (సిహెచ్‌డబ్ల్యు) వేతన సమస్యలపై సమరశీల పోరాటాలు సాగించి వారికి అండగా నిలిచింది. అదే విధంగా ఫారెస్ట్ వర్కర్స్ యూనియన్, వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం, ఉపాధి హామీ వర్కర్స్ యూనియన్, ఎపిఎండిసి ట్రైబల్ వర్కర్స్ యూనియన్, ప్రయివేట్ టూరిజం వర్కర్స్ యూనియన్, జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్, వెలుగు విఒఎల సంఘం, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం, గిరిజన సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్, ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం, జిసిసి హమాలీల సంఘం, ఆటో వర్కర్స్ యూనియన్, భవన నిర్మాణ కార్మికుల సంఘం, మోటారు వర్కర్స్ యూనియన్, కాఫీ లైజన్ వర్కర్ల సంఘం, 104, 108, ఉద్యోగ సంఘాలు, తదితర కార్మిక సంఘాలు సిఐటియు గొడుగు కింద పనిచేశాయి.

సమరశీల పోరాటాలతో వెన్నుదన్ను

జెండావిష్కరణలు. బైక్ ర్యాలీలు, ఇంటింటా ప్రచారాలు

సిఐటియు 18వ అఖిలభారత మహాసభ నేపథ్యంలో మన్యం కార్మిక వర్గాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అంతటా కార్మికుల్లో సందడి అలుముకుంది. డిసెంబర్ 15 నుంచి మన్యంలో కార్మిక సంఘాలు సిఐటియు అఖిలభారత మహాసభ గురించి విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాయి. ఇంటింటా కరపత్రాలు పంపిణీ, మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు, విరాళాలు సేకరణ తదితర తదితర ప్రచార కార్యక్రమాలను నిర్వహించాయి. కార్మికవాడల సముదాయాలు, కార్మిక సంఘాల నేతల గృహాలపై జెండా ఆవిష్కరణలు నిర్వహించారు. పాడేరు ఏజెన్సీలోని సుమారు 100 చోట్ల జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. సిఐటియు అల్లూరి జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి సుందర్రావు ఆధ్వర్యంలో సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం కోసం పలు ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. అఖిల భారత మహాసభలో భాగంగా ఈ నెల 4న విశాఖలో జరిగే సిఐటియు మహా ప్రదర్శన, బహిరంగ సభకు భారీగా తరలివెళ్లేందుకు మన్యంలోని అన్ని ప్రాంతాల్లో కార్మికులు సమాయత్తం అవుతున్నారు. పాడేరు ఏజెన్సీ నుంచి సుమారు 5 వేల మంది కార్మికులు తరలివెళ్లనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు వెల్లడించారు.


మాట్లాడుతున్న శివప్రసాద్

గ్రంథాలయాలతోనే ప్రజా చైతన్యం

ప్రజాశక్తి-గాజువాక

ప్రజల చైతన్యం కోసం గ్రంథాలయాలు అవసరమని గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ నాయకులు వల్లూరి శివప్రసాద్ అన్నారు. ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏడు రోజులుగా జరుగుతున్న శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా సాహిత్య వేదికపై శుక్రవారం 'గ్రంథాలయాల ఆవశ్యకత - సవాళ్లు ' అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల చైతన్యం, జ్ఞాన సంపద, మానవత విలువల కోసం గ్రంథాలయ ఉద్యమం చేపట్టాల్సి ఉందన్నారు. ప్రజలు చెల్లించే పన్నుల్లో 8 శాతం గ్రంథాలయాలకు కేటాయించాలని, 1960లో ప్రకాశం పంతులు చట్టం చేస్తే, ఆ చట్టం ఇప్పుడు అమలు కావడం లేదని చెప్పారు. గ్రంథాయ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని పాలకులు 1980లోనే ప్రయత్నాలు మొదలు పెట్టారని గుర్తుచేశారు. కర్ణాటక ప్రభుత్వం 3,576 గ్రంథాలయ పోస్టులు నియామకం చేపట్టిందన్నారు. తమిళనాడు ప్రభుత్వం సంవత్సరానికి రూ.100 కోట్లు గ్రంథాలయాలకు పుస్తకాలు కొనుగోలు చేయడానికి కేటాయించిందన్నారు. మన రాష్ట్రంలో ఏడాది రూ.140 కోట్లు గ్రంథాలయాల నిర్వహణకు ఇవ్వాల్సి ఉండగా, రూ40 కోట్లు ఇచ్చి, మిగతా రూ.100 కోట్ల కోసం ఏమీ చెప్పడం లేదన్నారు. భవంతులు కడితే అభివృద్ధి కాదని, పిల్లలు జ్ఞానసంపద కూడా సంపాదించాలని అభిప్రాయ పడ్డారు. విద్యా వ్యవస్థలో కూడా బట్టి విధానం ర్యాంకులే తప్ప కొత్తదనం లేదన్నారు. ప్రభుత్వాలు ఓట్లు రాబట్టుకోవడానికి చూస్తున్నాయి గాని గ్రంథాలయ అభివృద్ధికి ప్రయత్నించడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. గ్రంథాలయ శాఖ అనేది స్వతంత్రంగా ఉండాలి తప్ప విద్యా శాఖలో ఉండకూడదని స్పష్టంచేశారు. గ్రంథాలయాల ఏర్పాటు కోసం ప్రభుత్వంతో పాటు మనం కూడా కృషి చేయాలని కోరారు. పిల్లలతో పుస్తక పఠనం చేయించాలన్నారు.

సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి కెంగార మోహన్ మాట్లాడుతూ గతంలో గ్రంథాలయాలకు స్వయం ప్రతిపత్తి ఉండేదన్నారు. గ్రంథాలయాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదని, ఆరేళ్లుగా పుస్తకాలు కొనుగోలు చేయడం లేదని చెప్పారు. గ్రంథాలయ వ్యవస్థ సంక్లిష్టమైన పరిస్థితుల్లో ఉందన్నారు. గ్రంథాలయాలు గ్రామాల్లో కూడా విస్తరించాలని ఆకాంక్షించారు. ఆంధ్రా యూనివర్సిటీ లైబ్రరీ ప్రొఫెసర్ ధనరాజు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రంథాలయాలు కొన ఊపిరితో నడుస్తున్నాయని అన్నారు. మేధావులు వికసించే చోట ప్రశ్నించేతత్వం పెరుగుతుందని తెలిపారు. విద్యావంతుల మౌనం వీడాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి కుమార్ రాజా మాట్లాడుతూ సెస్ బకాయిలు వసూలైన వెంటనే అభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు. పౌర గ్రంథాలయ సేవాసమితి అధ్యక్షులు బి.ఎల్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. అనంతరం మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.


పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న జిసిసి ఎమ్‌డి కల్పనాకుమారి, చిత్రంలో వెంకటేశ్వరరావు

పుస్తక మహోత్సవాన్ని సందర్శించిన జిసిసి ఎమ్‌డి

ప్రజాశక్తి-గాజువాక

శ్రామిక ఉత్సవ్ వద్ద ఏర్పాటు చేసిన విశాఖ పుస్తక మహోత్సవాన్ని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి శుక్రవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా పుస్తకాల స్టాల్స్‌లో కలియదిరిగారు. అవసరమైన పుస్తకాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి డిప్యూటీ ఎడిటర్ రాంభూపాల్, జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ప్రజాశక్తి బుక్ హౌస్ నిర్వాహకులతో ఆమె మాట్లాడుతూ.. ఎంతమంది వస్తున్నారు.. ఏయే పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు ? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె పుస్తకాలు కొనుగోలు చేశారు. చాలా సమాచారంతో కూడిన పుస్తకాలను అందుబాటులో ఉంచారని, పుస్తక ప్రదర్శన అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనను మళ్లీ ఏర్పాటుచేయాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీకాకుళం
శనివారం 3 జనవరి 2026

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM





థింసా నృత్యంతో ఆకట్టుకున్న గిరిజన కళాకారులు



డ్యాన్సులతో హుషారెక్కిస్తున్న యువత



డ్రమ్స్ మోగిస్తూ మహిళల సందడి



ఎర్రజెండా గొప్పతనాన్ని వివరిస్తూ మహిళా కళాకారుల నృత్యం



అభ్యుదయ గేయాల ఆలాపన

చివరి రోజూ అదే జోరు

ముగిసిన శ్రామిక ఉత్సవ్ • అనూహ్య స్పందన

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి


ఆట, పాట, మాటలతో.. ప్రదర్శనలతో ఆద్యంతం కళాకారులు... ఆహూతుల్లో ఉత్సాహాన్ని నింపారు. సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో ఏర్పాటుచేసిన శ్రామిక ఉత్సవ్ శుక్రవారం ముగిసింది. ఏడు రోజులపాటు నిర్వహించిన కార్మికుల పండగ ఉత్సాహ పూరితంగా సాగింది. ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, పాడిన పాటలు, గేయాలు.. పాలకులు, పెట్టుబడిదారుల గుండెల్లో తూటాల్లా పేలాయి. ఆద్యంతం చైతన్యాన్ని నింపాయి. జివిఎంసి కళాకారుల 'తీన్ మార్' సభికుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఉపాధ్యాయులు జి.గౌరినాయుడు రాసిన 'నా దేశ గత చరిత్ర నెత్తుటి మరకే... ఐనా నా తల్లి మనసు మీగడ తరగ' అంటూ గత దేశ చరిత్రను, ప్రస్తుత దేశ పరిస్థితులను అన్వయిస్తూ వివరించారు కళాకారులు. 'మృత వీరుల చెరగని మువ్వన్నెల పతాకా.. విశ్వ వీణ తంత్రులై.. విమల గానమౌతుందని..' అంటూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన త్యాగధనుల స్ఫూర్తిని నింపుకుని పోరాడాలని, తద్వారానే పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమని వివరించే ప్రయత్నం చేశారు. 'రాతి గుండె చప్పుడు.. జలియన్ వాలాబాగ్ .. ప్రవహించే వాగులు వెచ్చని నెత్తుటి వాగు..' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన పాట సభికులను ఆలోచింపజేసింది. 'పట్టు పట్టక్క... జెండా పట్టక్క.. సిఐటియు నీకు నాకు అండదండక్క' అంటూ విజయనగరం జిల్లా అంగన్వాడీలు ప్రదర్శించిన కోలాటం ఆద్యంతం ఆసక్తి కలిగించింది. కిశోర బాలికలకు నైతిక విలువల పెంపుదలకు అంగన్వాడీలు చేస్తున్న కృషిని వివరించారు 'ఒకరిద్దరు పిల్లలు చాలు.. ఆడపిల్లలే మేలని' పేర్కొంటూ పాడుతూ.. ప్రదర్శించిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

'సిఐటియు జెండా ఎత్తి.. మనమంతా దండెత్తి.. హక్కులను సాధిద్దాం..' అంటూ అంగన్వాడీల కోలాటం ప్రదర్శన ద్వారా వారు చేపట్టిన పోరాట పటిమను వివరించారు. అంగన్వాడీ ప్రాజెక్టును గంగలో కలిపేస్తే ఊరుకోబోమంటూ కోలాట ప్రదర్శన ద్వారా పాలకులను హెచ్చరించారు. 'సిఐటియు సంఘమో.. పోరాటాల రంగమో..' అంటూ అంగన్వాడీలు కోలాట ప్రదర్శన ద్వారా సిఐటియు విశిష్టతను వివరించారు. వారానికి రెండు గుడ్లు పెట్టాలని చెబుతారు.. అప్పు తెచ్చి వండి పెడితే.. కిరాణా దుకాణం యజమానికి సకాలంలో డబ్బులు చెల్లించుకుంటే పడే ఇబ్బందులను, అవస్థలను ప్రస్తావించారు అంగన్వాడీలు. 'హల్లా బోల్' వీధినాటిక ప్రదర్శిస్తున్న ప్రజా కళాకారుడు సఫ్దార్ హష్మీ ఇదే రోజున నాటి కాంగ్రెస్ పాలకుల చేతిలో నడి రోడ్డుపై అత్యంత కిరాతకంగా హత్య చేయబడ్డాడని ప్రజానాట్య మండలి కళాకారులు గుర్తు చేస్తూ, ఆయనను స్మరించుకుంటూ తొలుత హష్మీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళారంగాన్ని అప్పటి పాలక వర్గాలు తమ ప్రచార బాకాగా మలుచుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు హష్మీ. ఆయన స్ఫూర్తితో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించడమే మనమిచ్చే ఘన నివాళి అని కళాకారులు స్పష్టం చేశారు.



హీరోయిన్ గీత సైని







ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు



శ్రామిక ఉత్సవ్‌కు హాజరైన ప్రజానీకం



సిఐటియు అఖిల భారత నాయకులకు ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థులు

శ్రామిక ఉత్సవ్'లో విజ్ఞాన పరిమళాలు

ముగిసిన సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

శాస్త్ర విజ్ఞాన ప్రచారాన్ని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు మూఢ విశ్వాసాలను ప్రజల్లో పెంచి పోషిస్తూ, జనాల మధ్య కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతూ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతున్నాయని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు విమర్శించారు. గత ఏడు రోజులుగా ఆంధ్రా యూనివర్సిటీ ఎగ్జిబిషన్ గ్రౌండ్లో సిఐటియు 18వ అఖిలభారత మహాసభ సందర్భంగా ఏర్పాటుచేసిన శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా జన విజ్ఞాన వేదిక నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ శుక్రవారం ముగిసింది. ముగింపు సమావేశంలో ఎ.వి.నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శ్రామిక ఉత్సవ్ ఆహ్వాన సంఘం కన్వీనర్ డాక్టర్ రమాప్రభ మాట్లాడుతూ కార్మికుల కష్టంతో చెమట చుక్కతో సంపదని సృష్టిస్తే ఆ సంపదను కొంతమంది పెట్టుబడిదారులకు ప్రస్తుత ప్రభుత్వాలు ధారదత్తం చేస్తున్నాయని విమర్శించారు. ఆదిమ సమాజం నుంచి ఈనాటి ఆధునిక సమాజం వరకు మనిషి మెదడులో తలెత్తిన ప్రశ్న.. అప్పటినుంచి ఇప్పటివరకు పాలకులను ప్రశ్నించడం ద్వారానే అనేక నూతన ఆవిష్కరణలు వెలుగుచూశాయని, అవన్నీ కూడా ప్రజలు, కార్మికుల సౌకర్యవంతమైన జీవనానికి దోహదపడ్డాయని గాజువాక ప్రజా వైద్యశాల డాక్టర్ రమేష్ కుమార్ అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు విద్యా, కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ప్రజలందరూ సంఘటితమై పోరాడితే తప్ప ఈ పరిస్థితి నుంచి బయట పడలేమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్య, వైద్య రంగాలను అంగట్లో [illegible] మార్చివేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ వైఎల్ నరసింహారావు మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచన, సైన్స్ మనిషి జీవితంలో అంతర్భాగమన్నారు. ప్రజల దైనందిన జీవితం ఆచరణాత్మకంగా ఉండాలని, కానీ ప్రభుత్వాలు ప్రజల్లో మూఢవిశ్వాసాలను పెంచి పోషిస్తూ వారిని ప్రశ్నించే వారిపట్ల ద్వేష భావాన్ని రగిలిస్తూ దమనకాండకు, దాడులకు, అక్రమ అరెస్టులకు పురిగొల్పే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మురళీధర్ అధ్యక్షత వహించారు. ఏడు రోజుల పాటు జరిగిన ఈ సైన్స్ ఎగ్జిబిషన్లో సుమారు ఏడు వేల మంది ప్రజలు, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం ఎగ్జిబిషన్లో పాల్గొన్న కాలేజీలకు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గాయత్రి మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ ఇ.రవికిరణ్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.కృష్ణారెడ్డి, కెమికల్ ఇంజనీరింగ్ గ్రీన్వేడ్స్ ఫైర్ అండ్ సేఫ్టీ కాలేజ్ కోఆర్డినేటర్ సవిత, పెందుర్తి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ సీనియర్ లెక్చరర్ డాక్టర్ శ్రీనివాస్, సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజీ కన్వీనర్ డి.కిషోర్ కుమార్, విశాఖ ఇంజనీరింగ్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వరప్రసాద్, విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీ కోఆర్డినేటర్ డాక్టర్ సంపదక్షిణమూర్తి, జన విజ్ఞాన వేదిక విశాఖ జిల్లా నాయకులు వై.ఆర్.కె. ప్రసాద్, జెవివి రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి, కె.శేషగిరిరావు, జిల్లా నాయకులు గోపాలరావు, రత్నారావు, ఆట్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎల్.నర్సింహారావు

వర్గ పోరాటంతోనే సమాజ మార్పు

'శ్రామిక ఉత్సవ్'లో ప్రముఖ దర్శకులు రాజమురుగన్



హష్మీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దర్శకుడు రాజమురుగన్, తదితరులు



మాట్లాడుతున్న దర్శకుడు రాజమురుగన్, వేదికపై ఉమామహేశ్వరరావు, అట్టాడ సృజన్, శ్రీచరణ్, గీత సైని

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

వర్గ పోరాటంతోనే సమాజ మార్పు సాధ్యమని ప్రముఖ తమిళ దర్శకుడు రాజమురుగన్ అన్నారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సందర్భంగా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏడు రోజులుగా జరుగుతున్న 'శ్రామిక ఉత్సవ్' శుక్రవారం ఘనంగా ముగిసింది. చివరి రోజు 'ఆహారం, ఆరోగ్యం, విద్య, ఉపాధి - హక్కులకై ఉద్యమిద్దాం' అన్న థీమ్‌తో కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమురుగన్ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత నటుడు చార్లీ చాప్లిన్ తన మూగ సినిమాల ద్వారా ఆకలి విలువను అద్భుతంగా చిత్రీకరించారని కొనియాడారు. చాప్లిన్ అమెరికా, ఇంగ్లాండ్ వంటి ధనిక దేశాల్లో పెరిగినా, ఆయనకు ఆకలి గురించి ఎలా తెలుసని అడిగితే 'నేను కమ్యూనిస్టును కాబట్టే ఆకలి విలువ తెలిసింది' అని ఆయన చెప్పుకొచ్చిన విషయాన్ని రాజమురుగన్ గుర్తుచేశారు. ఆకలిని ప్రతిబింబించేందుకు భాషతో పనిలేదని ఆయన నిరూపించారన్నారు. నేటి భారతదేశంలో మితవాద శక్తులు సమాజాన్ని విడదీస్తున్నాయని, వారికి వ్యతిరేకంగా మనం ప్రేమ, త్యాగం వంటి విలువలను ఆయుధాలుగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సంపదలో మెజారిటీ వాటా కేవలం 60 వేల మంది చేతుల్లోనే ఉందని, పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. కుల, మత బేధాలను విస్మరించి సోషలిజం సాధన కోసం వర్గ పోరాటమే ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు.

సభాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. కష్టజీవుల శ్రమ దోపిడీకి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఆయన ఎండగట్టారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ సామాన్యులకు వైద్యాన్ని దూరం చేస్తున్నారని, విద్యా చట్టం పేరుతో కేవలం డబ్బున్న వారికే చదువును పరిమితం చేస్తున్నారని విమర్శించారు. చదువుకున్న యువతకు నామమాత్రపు జీతాలతో కార్పొరేట్ కంపెనీలలో బానిస చాకిరీ మిగిలిందని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఆంక్షల పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. నెలకు ఐదు కేజీల బియ్యంతో ఒక కుటుంబం ఎలా జీవించగలదని ఆయన పాలకులను నిలదీశారు.

ఘనంగా ముగింపు

కార్యక్రమం ముగింపులో భాగంగా వారం రోజుల పాటు వివిధ విభాగాల్లో సహకరించిన వాలంటీర్లకు, కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యువ దర్శకుడు అట్టాడ సృజన్, 'కన్యాకుమారి' చిత్ర నటులు శ్రీచరణ్, గీత సైని, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ కె.రమాప్రభ, కుమార మంగళం, మోహన్‌రావు, సిద్దిరెడ్డి జోగిరాజు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి (ఫైల్)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వెనుక తెలుగు ప్రజల చారిత్రక పోరాట నేపథ్యం వుంది. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో 32 మంది ప్రాణాల బలిదానంతో తెలుగు ప్రజలు ఏకోన్ముఖంగా పోరాడి సాధించుకున్న ఘనత దీనిది. ఉక్కు పరిశ్రమ పురోగమనంలో కార్మికులు, ఉద్యోగుల కఠోర శ్రమ వుంది. ప్రభుత్వాల సహాయ నిరాకరణ, కుట్రలపై ప్రతిఘటన వుంది. ఆది నుంచి ప్రభుత్వాల కుట్రలు, కుతంత్రాలను ఎదురొడ్డి ఉక్కు పరిశ్రమను నిలబెట్టుకోవడంలో ప్రజల పాత్ర వుంది. సోషలిస్టు రష్యా సహకారం వుంది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు నాలుగున్నరేళ్లుగా కుట్రలు చేస్తున్నా సిఐటియు నేతృత్వాన కార్మికవర్గం అలుపెరగని పోరాటాలతో తిప్పికొడుతూ వస్తోంది.

ఉక్కు పరిరక్షణకు సమరశీల పోరాటాలు

సిఐటియు నేతృత్వాన ఉద్యమిస్తున్న కార్మికవర్గం



బైక్‌ర్యాలీ చేపడుతున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, సిఐటియు నాయకులు (ఫైల్)

ప్రజాశక్తి - విశాఖపట్నం

అది 1963వ సంవత్సరం. ఐదో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటికే భిలాయ్, బొకారో, రూర్కెలా, దుర్గాపూర్‌లో స్టీల్‌ప్లాంట్‌లు ఉండడంతో, సముద్ర తీరానవున్న విశాఖపట్నం అనుకూల స్థలమని ఆంగ్లో ఇండియన్ కన్సార్టియం ప్రతిపాదించింది. విశాఖలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని 1966 జులై 1న శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించి, కేంద్ర ప్రభుత్వానికి పంపింది. దీనికి ఆనాటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా లేదు. అయితే, వెనుకబడిన విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ నిర్మిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉపాధి దొరుకుతుందని నాడు అందరిలో ఆశ చిగురించింది. విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని 1966 అక్టోబర్ 21న విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' అని నినదించారు. రైళ్లను ఆపేశారు. ఉద్యమ నినాదం తెలుగు ప్రజల్లోకి బలంగా వెళ్లింది. సాధించుకోవాలన్న పట్టుదల పెరిగింది. ఇది భరించలేని ప్రభుత్వం 1966 నవంబరు 1న ఉద్యమకారులపై కాల్పులు జరిపి 9 మందిని బలితీసుకుంది. దీన్ని నిరసిస్తూ వీధుల్లోకి వచ్చి ఆందోళనకు దిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు, యువకులు, ప్రజలపై ప్రభుత్వం దమనకాండకు దిగి 32 మంది ప్రాణాలను బలిగొంది.

కాల్పులను నిరసిస్తూ, విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలన్న డిమాండ్‌తో పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి సహా 53 మంది కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు, తెన్నేటి విశ్వనాథం వంటి 14 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారు. అమృతరావు నిరాహారదీక్ష ప్రారంభించారు. ప్రజాపోరాటాల ధాటికి తట్టుకోలేక నాటి కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. 1970 ఏప్రిల్ 17న నాటి ప్రధాని ఇందిరా గాంధీ విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటును ప్రకటించి, 1971 జనవరి 20న పైలాన్ ఏర్పాటుచేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి 16,500 మంది రైతులు ముందుకొచ్చి, 64 గ్రామాలు ఖాళీచేసి 22 వేల ఎకరాల భూములిచ్చారు.

కేంద్రం సహాయ నిరాకరణ : అప్పులతో వడ్డీల భారం

స్టీల్ అథారిటీ ఇండియా లిమిటెడ్ (సెయిల్) నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 1982 ఫిబ్రవరి 18న వేరుచేశారు. 20 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మించాల్సిన స్టీల్‌ప్లాంట్‌ను రేషనలైజ్డ్ కాన్సప్ట్ పేరుతో 3.4 మిలియన్ టన్నులకు పరిమితం చేసి కేంద్రం కేవలం రూ.4,889 కోట్లు కేటాయించింది. మిగిలిన డబ్బులు వివిధ బ్యాంకుల్లో అప్పులు చేసి 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్‌ను నిర్మించుకొని 1991లో ఉత్పత్తి ప్రారంభించారు.

దేశంలో ఇతర స్టీల్‌ప్లాంట్లను కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించగా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర సహకారం లేకపోవడంతో, అప్పులుచేసి నిర్మించడంతో వడ్డీల భారం పెరిగింది. వడ్డీలు పెరిగి నష్టాలు రావడంతో 1999లో బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బిఐఎఫ్ఆర్‌కు నివేదించి, ప్రయివేటీకరణ వాదన ముందుకు తెచ్చింది. దీనికి వ్యతిరేకంగా పోరాటం జరగడంతో రూ.1500 కోట్లు కేటాయించింది. స్టీల్‌ప్లాంట్‌కు ప్రభుత్వాలు సొంత గనులు కేటాయించకపోయినా, బహిరంగ మార్కెట్‌లో గనులు కొనుక్కొని, 120 శాతం సామర్థ్యంతో నడిచేలా కార్మికులు, ఉద్యోగులు విశేష కృషిచేశారు. 2002 నుంచి 2015 వరకు సుమారు రూ.12,900 కోట్లు లాభాలు వచ్చాయి. ప్రభుత్వం కేటాయించిన సొమ్మును ప్లాంట్ తిరిగి చెల్లించగలిగింది. అనంతరం మిగులు సొమ్ముతో పాటు, రూ. 18 వేల కోట్లకుపైగా అప్పుచేసి 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి స్టీల్‌ప్లాంట్‌ను విస్తరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. 2008 నుంచి 2019 వరకు 10 వేల పర్మినెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు వచ్చాయి. నిర్వాసిత కుటుంబాలకు, ఎస్‌టి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, మాజీ సైనిక ఉద్యోగులు, మహిళలు, వికలాంగులకు ఉద్యోగాలు లభించాయి.



వైజాగ్ స్టీల్‌ప్లాంట్

వెంటాడుతున్న ముడి ఖనిజ సమస్య

ప్లాంట్ సామర్థ్యం పెంచుకున్నా, ముడిఖనిజం సమస్య స్టీల్‌ప్లాంట్‌ను వెంటాడుతూనే వుంది. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రైవేటు, ప్రభుత్వ స్టీల్ పరిశ్రమలతోపాటు, స్టీల్‌ప్లాంట్ నిర్మాణమే చేపట్టని పోస్కోకు సైతం ఐరన్‌ఓర్ గనులు కేటాయించింది. కానీ, పభుత్వరంగ సంస్థ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నేటికీ ఐరన్‌ఓర్ కేటాయించలేదు. సొంత గనులున్న స్టీల్‌ప్లాంట్లకు ఒక టన్ను ఉత్పత్తికి కేవలం రూ.500 ఖర్చు అవుతుండగా, విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెట్‌లో ఐరన్ ఓర్ టన్నును రూ.5 వేల నుంచి రూ.8 వేలకు కొంటోంది.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

సెయిల్ నుంచి నుంచి స్టీల్‌ప్లాంట్‌ను వేరుచేసినప్పుడు బైలదిల్లాలోని 4, 5 బ్లాకుల గనులను విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించి, ఐరన్ ఓర్ సరఫరా చేస్తామని నమ్మబలికారు. అయితే మన రాష్ట్రంలోని ఐరన్ ఓర్ గనులను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని సిఐటియు హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని నాటి ప్రభుత్వానికి ఆదేశించారు. అయినా గనులు కేటాయించకుండా. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పాల్జేస్తున్నాయి. సముద్ర తీరాన స్టీల్‌ప్లాంట్ నిర్మించినట్టయితే రవాణాకు అనుకూలమై, అత్యంత తక్కువ ఖర్చుతో ముడిసరుకును దిగుమతితోపాటు, స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను చౌకగా ఇతర దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని భావించారు. అనుబంధంగా పిపిపి విధానంలో గంగవరంలో పోర్టు నిర్మించినా, దాన్ని అదానీకి కట్టబెట్టారు. ఆ ప్రభావం స్టీల్‌ప్లాంట్‌పై పడింది. ముడిసరుకు రాకుండా ఇబ్బందులను సృష్టించడంతో రూ.మూడు వేల కోట్లు పైగా నష్టం వాటిల్లింది.

పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఆధునిక దేవాలయాలంటూ నాటి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేస్తే, వ్యాపారం ప్రభుత్వ పని కాదంటూనే ప్రభుత్వ సంస్థలు చావడానికే పుట్టాయంటూ మోడీ ప్రభుత్వం ప్రజల సొమ్ముతో ఏర్పాటైన వీటిని పెట్టుబడిదారులకు కట్టబెడుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని 2021 జనవరి 27న నిర్ణయించింది.

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన విశాఖ ఉక్కుపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగా ఆధారపడి సుమారు లక్ష మంది జీవిస్తున్నారు. రాష్ట్రంలోనే అధిక తలసరి ఆదాయం గాజువాకకు ఉండడానికి విశాఖ ఉక్కు కారణం. అయినా దీన్ని ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తుండటంతో సిఐటియు నేతృత్వాన కార్మికవర్గం అలుపెరగని పోరాటం చేస్తోంది. ఆ ఉద్యమాన్ని పట్టించుకోకుండా.. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం లేదా మూసేస్తామంటూ మోడీ సర్కారు ముందుకెళ్తోంది. ఈ క్రమంలోనే ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు సరఫరాను కావాలనే నిలిపేస్తోంది. ఉద్యోగులపై ఆర్థిక దాడి చేస్తోంది. కొన్ని నెలలుగా సకాలంలో జీతాలు చెల్లించడంలేదు. ఉద్యోగులను విఆర్ఎస్ పేరుతో బయటకు పంపేస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించే కుట్రలు సాగుతున్నాయి. ప్లాంట్‌ను రక్షిస్తామని హామీనిచ్చి గెలిచిన టిడిపి కూటమి ప్రభుత్వం నేడు దుర్మార్గ వైఖరిని అవలంబిస్తోంది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపుతున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయించాలని చంద్రబాబు, పవన్‌లను సిఐటియు డిమాండ్ చేస్తోంది.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు (ఫైల్)

పాస్ పుస్తకాలు పంపిణీ



పోలాకి : పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి



ఆమదాలవలస : పాసు పుస్తకాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- పోలాకి

మండలం, కొల్లివలస గ్రామంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రభుత్వం నూతనంగా జారీచేసిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను కూటమి నాయకులు, అధికారులతో కలిసి రైతులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ఫోటోలతో జారీ చేసిన పాసుపుస్తకాల్లో తప్పిదాల వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. అన్ని ఇబ్బందులను అధిగమించి ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో కూడిన పాస్ పుస్తకాలను రైతులకు నేడు అందజేస్తున్నామన్నారు. నేటి నుంచి ఈనెల 9 వరకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్‌లు ప్రగడ సూరిబాబు, చిట్టి సింహాచలం, భైరి సుందరరావు, సాధు రాజన్నాయుడు, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి.రవికుమార్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని వల్లభరావుపేటలో పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, మండపాక కనకరావు, ఎంపిటిసిలు దన్నాన వంశీ, సూరాడరాముడు, పిసిని ఆసిరినాయుడు, పైడి అప్పుడుదొర, రెడ్డి కోటేశ్వరరావు, వడ్డాది శ్రీనివాసరావు, ఎఎంసి డైరెక్టర్ అనంత్ మహంతి, పిఎసిఎస్ డైరెక్టర్ దన్నాన రవీంద్ర, స్థానిక నాయకులు బొంతు రమణ, గురాన రామారావు, బొంతు ఆనంద్, తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలో ముచింద్ర, కేదారిపురం పంచాయతీలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. పలువురు రైతులు, గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.వెంకటరావు, టిడిపి నాయకులు, పిఎసిఎస్ అధ్యక్షులు పెద్దిన బాబ్జీ, లోపింటి పద్మనాభం, దక్కత ఢిల్లీరావు, మెరుగు సూర్యనారాయణ రెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తిప్పిన దుర్యోధన రెడ్డి, కామేశ్వర రావు, సాడి సహదేవ్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరి, రెవెన్యు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పలాస: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలం రంగోయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ జి.వెంకటేష్, ఎమ్మెల్యే గౌతు శిరీష రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి విఠల్‌రావు, ఎంపిడిఒ వసంత కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మరావు, కూటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నం మండలం ఎఎస్ కవిటి గ్రామంలో గ్రామసభ, రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, మండల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని వంజంగిపేట రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన రాజముద్ర పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రవికుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు సనపల ఢిల్లీశ్వరరావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు మెట్ట సుజాత, టిడిపి మండల అధ్యక్షులు నూకరాజు, జనసేన కన్వీనర్ పేడాడ రామ్మోహనరావు, తహశీల్దార్ రాంబాబు, టిడిపి నాయకులు నాని, హనుమంతు బాలకృష్ణ, ఎండ అప్పలనాయుడు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని ముక్తాపురం, మాకనపల్లిలో తహశీల్దార్ బడే పాపారావు రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ, మండల టిడిపి అధ్యక్షులు జగన్మోహనరావు, డిప్యూటీ తహశీల్దార్ రాము, భూ సర్వే డిటి వెంకటరావు, ఆర్‌ఐ ఆశ, సర్పంచ్ తాడేల వజ్రమ్మ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని సరుబుజ్జిలి, సలంత్రి, కొత్తకోట గ్రామ సచివాలయ పరిధిలో రీ సర్వే పూర్తి చేసుకున్న శరభాపురం, నరసింగపల్లి, చేపలవలస రెవెన్యూ గ్రామ రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ పంపిణీ చేశారు కార్యక్రమంలో రీసర్వే డిటి వెంకటగిరి, డిటి జగదీష్, విఆర్‌ఒలు, టిడిపి మండల అధ్యక్షులు అంబళ్ల రాంబాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు దవల సింహాచలం, ప్రభాకర్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని కొత్తకుంకాం, పోతయ్యవలస, పెద్దలింగాలవలసలో కొత్త పాస్ పుస్తకాలను తహశీల్దార్ ఈశ్వర శ్రీనివాసరావు రైతులకు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో రీసర్వే డిటి రాపర్తి అప్పలరాజు, విఆర్‌ఒలు, సచివాలయాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అలాగే మురపాకతో పాటు ఏడు గ్రామాల్లో రీసర్వే కార్యక్రమాన్ని మండల సర్వేయర్ బచ్చు శ్రీధర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సర్పంచ్ ప్రతినిధి పి.లక్ష్మణరావు, కూటమి నాయకులు జల్లేపల్లి జనార్దన్, మడ్డి కనకయ్య, ఆర్‌ఐ పైడి శివ హారతి, రైతులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పలాస : పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఆర్‌డిఒ



పాతపట్నం : పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

కవిటి: మండలంలోని బైరిపురం, ప్రగడపుట్టుగలో పాసు పుస్తకాలను తహశీల్దార్ బి.మురళీ మోహన్, కూటమి నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.కృష్ణారావు, మణి చంద్ర ప్రకాష్, బార్ల చిన్నబాబు, బాసుదేవ్ ప్రధాన్, రంగా రౌళో, ఎస్ రమణమూర్తి, బి రమేష్, బి తిరుమల కుమార్, సంతోష్ పట్నాయక్, పుల్లట సంతోష్, రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని వసప, సందిపోలంలో తహశీల్దార్ వై.జోగారావు అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవ రావు, పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ, జిల్లా ఆర్గనైజర్ కార్యదర్శి ఆగతముడి.అరుణ్ కుమార్, సర్పంచ్ వి.ఆఫీస్ రావు, విఆర్‌ఒ గిరీష్ కుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

పొందూరు : మండలం లోలుగులో రీ-సర్వేకు సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు ఎమ్మెల్యే కూన రవికుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.వెంకటేష్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలకు పొందూరు ఉపాధ్యాయులు



ఫణిరాజు, రాజారావు

పొందూరు: ఈ నెల 3,4,5 తేదీల్లో అమరావతిలో ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహా సభలకు మండలంలోని గోకర్ణపల్లికి చెందిన సంపతిరావు ఫణిరాజు, వావిలపల్లిపేటకు చెందిన వావిలపల్లి రాజారావు హాజరుకానున్నారు. ఇందులో ఫణిరాజు డా.ఘంటశాల, ఎస్‌పి బాలసుబ్రమణ్యం పాడిన సినిమా పాటలను పాడేందుకు అవకాశం దక్కింది. ఈయన ఎల్ఎన్‌పేట మండలంలోని చింతల బడవంజ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. అలాగే కవి, రచయిత రాజారావు ఎన్నో కవితలు, కథలు, వ్యాసాలు రాశారు. మహోన్నత శిఖరాలు, నాదేశం, వికసిత విశ్వంభర, ఎందరో మహాను భావులు వంటి గ్రంథాలను రాసి ప్రచురితం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభలకు ఉపాధ్యాయుడు ఫణిరాజుకు ఆహ్వానం అందడంపై టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఉద్దానం అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో భావనపాడులో శనివారం ఉచితనేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవాసమితి వ్యవస్థాపకులు తామాడ లక్ష్మణరావు తెలిపారు. గ్రామంలోని వివేకానంద పార్క్ ఆవరణలో నిర్వహించనున్న ఈ శిబిరంలో నేత్ర పరీక్షలు, వైద్యుల సలహాలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఉద్దానం ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ శిబిరానికి హాజరయ్యే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో పాటు, ఉద్యోగులు ఇహెచ్‌ఎస్ కార్డును కూడా తీసుకురావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు మోడల్ పేపర్ పంపిణీ



మోడల్ పేపర్‌తో విద్యార్థులు

ప్రజాశక్తి- మందస

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లను పంపిణీ చేసినట్లు ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హరిపురంలో చదువుతున్న 120 మంది విద్యార్థులకు నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులచే తయారు చేయబడిన ఇంగ్లీష్ మీడి యం యుటిఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్లు అందజేశారు. యుటిఎఫ్ పూర్వపు జిల్లా కార్యదర్శి గున్న రమేష్ మాట్లాడుతూ మోడల్ పేపర్లకు అయ్యే ఖర్చు రూ.10 వేలు విజయవాడలో స్థిరపడ్డ బాలిగాం గ్రామస్తులైన అజితేస్ టెక్నాలజీ సంస్థ వారు అందజేశారని, ప్రతీ సబ్జెక్టులో నాలుగు మోడల్ పేపర్లు చొప్పున ఉంటాయని, వీటిని బాగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చు నన్నారు. శతశాతం ఉత్తీర్ణతకు ఇవి ఎంతగానో సహాయ పడతాయన్నారు. కార్యక్రమంలో పిజిటి గున్న రమణ బాబు, ఉపాధ్యాయులు లఖినాన సాంబమూర్తి, జి.కృష్ణా రావు, వై రవి, ఎల్ సాంబమూర్తి, ఎస్ లింగరాజు తది తరులు పాల్గొని పుస్తకదాతలకు అభినందనలు తెలియ జేశారు.

ఇహెచ్‌ఎస్ స్కీం సద్వినియోగం చేసుకోవాలి



ఆర్‌టిసి ఉద్యోగులతో మాట్లాడుతున్న విశ్వనాథం, బాలకృష్ణ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ రైల్వేగేటు సమీపంలో ఉన్న సాయి శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇహెచ్‌ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీం)ను సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి ఎండి టి విశ్వనాథం, ప్రముఖ ఎముకల శస్త్రచికిత్స వైద్య నిపుణులు టి.బాలకృష్ణ అన్నారు. స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద శుక్రవారం ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులు ఎటువంటి ఆరోగ్య పరమైన సమస్యలు ఉన్న తమ ఆస్పత్రికి సంప్రదిస్తే తమవంతుగా వైద్య సేవలతో పాటు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ద్వారా రీయంబర్స్‌మెంట్ సదుపాయం అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు తాము 24 గంటల పాటు అందుబాటులో ఉండి పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పూర్తి వివరాలకు 9666005002 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్యాం సుందర నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ కరుణ శ్రీ, ఆర్‌టిసి ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ

బూర్జ: విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఒవిపేట ఆదర్శ పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే వారికి పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతిరోజు పోషక విలువలున్న ఆహారంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత వంటి విషయాలపై దృష్టి సారిస్తున్నామని, అలాగే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. త్వరలో జరగనున్న పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

సిపిఐ ఎంఎల్ లిబరేషన్‌కు రాజీనామా

పలాస: మండలం కొబ్బరిచెట్లూరు గ్రామానికి చెందిన దున్న శ్రీనివాస్ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం, జిల్లా లీడింగ్ కమిటీ సభ్యులు, ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి 2025 వరకు సభ్యత్వం, పదవులు చేపట్టానని, తాను వ్యక్తిగత కారణాలు వల్ల పదవులు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

శ్రీకాకుళం రూరల్ : గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ అన్నారు. మండలంలోని సింగపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆయన పర్యటించారు. రోడ్లపై, డ్రైనేజీల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయనతో ఎంపిడిఒ ప్రకాశరావు, కార్యదర్శి శ్యాంసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104లో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు కార్యాలయంలో జిల్లా సిఐటియు నాయుకులు (యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్) మురళి ఆధ్వర్యంలో సిఐటియు, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం. గోవర్ధనరావు అనుబంధ సంఘాల అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. భవ్య యాజమాన్యం 104 ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేస్తుందని, ఉద్యోగులకు సమస్యలు పెరిగిపోయాయని, ఎన్నిసార్లు యాజమానాన్ని కలిసి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేసినా ఫలించలేదన్నారు. తప్పని పరిస్థితిల్లో 104 ఉద్యోగులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందని, డిసెంబర్ 19 నుంచి ముందస్తు నోటీసు జారీ చేసి వివిధ రూపాల్లో తమ నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని, తమ సమస్యలు పరిష్కారం కాకపోతే మరింత ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా సిఐటియు కార్యాలయంలో అన్ని సిఐటియు అనుబంధ సంఘాలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సిఐటియు నాయకులు మురళి మాట్లాడుతూ భవ్య యాజమాన్యం తగ్గించిన వేతనాలు సవరించి పూర్తి వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వం కూడా జీతాలు పెంచే ఆలోచన చేయాలన్నారు. జిల్లా ప్రెసిడెంట్ చల్ల నారాయణ మాట్లాడుతూ తొలగించిన క్యాజువల్ లీవ్‌లు పునరుద్ధరించాలని, అన్ని ప్రభుత్వ సెలవులు 104 సిబ్బందికి కూడా వర్తింప చేయాలన్నారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం.రామారావు మాట్లాడుతూ తొలగించిన బఫర్ సిబ్బందిని తిరిగి నియమించి ఉద్యోగుల పనిఒత్తిడి తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసరి మహేష్, సిఐటియు జిల్లా నాయకులు సాయి ప్రకాష్, అంగన్వాడీ పట్టణ నాయకులు కళ్యాణి, ఆశావర్కర్లు యూనియన్ నాయకులు నాగమణి, 108 ప్రెసిడెంట్ విజయ మోహన్, 104 యూనియన్ వైస్ ప్రెసిడెంట్ అసిరి నాయుడు, సీతారాం రాజు, డివిజన్ నాయకులు కూర్మారావు, మహేష్, కిరణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సకాలంలో తాగునీరు అందించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగర ప్రజలకు సక్రమంగా సకాలంలో మున్సిపల్ అధికారులు, పాలక ప్రభుత్వం తాగునీటిని సరఫరా చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారని పట్టణ పౌర సంక్షేమ సంఘం టౌన్ కన్వీనర్ ఎం.గోవర్ధనరావు ప్రకటనలో తెలిపారు. గత కొద్దిరోజులుగా ప్రజలు, వాడుకకు నీరులేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ విషయం నగరంలో చర్చనియాంశంగా మారిందని అన్నారు. నీటిని యధావిధిగా సరఫరా చేయుటకు తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని, మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. నీటి సరఫరాకు మోటార్లు పాడైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడంలో నిర్లక్ష్యం శోచనీయమన్నారు. రానున్న సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకుని కొత్త మోటార్లు ఏర్పాట్లు చేసి నీటి సరఫరాను ప్రజలకు సక్రమంగా అందేవిధంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, లేదంటే ప్రజలను కలుపుకుని ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



బహుమతులు అందజేస్తున్న రాజేష్

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి- కవిటి

వైకుంఠ ఏకాదశి సందర్భంగా కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం కళ్యాణి స్కూల్ కరస్పాండెంట్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లొల్ల రాజేష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల వారిలో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి రామాయణం, భారతం, భగవద్గీత వంటి పురాణ ఇతిహాసాలను కనీసం ఒక్కసారైనా చదవడం ద్వారా దేశ చరిత్ర, సంస్కృతి అవగతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఎఒ రాణి, ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఉపాధ్యాయులు శ్రీదేవి, పవిత్ర, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న వైద్యులు

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి- పలాస

ప్రమాదాలు జరగకుండా వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్యాం సుందరనాయుడు అన్నారు. డిపో ఆవరణలో మిస్టర్ డెంటిస్ట్ ఇంటర్నేషనల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 120 ప్రథమ చికిత్స పెట్టెలను తన సొంత నిధులతో మిస్టర్ డెంటిస్ట్ వైద్యాధికారి మెట్ట లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రావణి దంపతులు డిపో మేనేజర్, డ్రైవర్లు, కండక్టర్లకు అందజేశారు. ప్రయాణికులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలు అందుబాటులో ఉండేలా ప్రథమ చికిత్స కిట్లు ఉచితంగా అందజేయడం హర్షణీయమన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స అందించేందుకు కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కె.కరుణశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రాయితీలపై చేప పిల్లలు

ప్రజాశక్తి- సోంపేట

జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో సోంపేట, కంచిలి మండలాల్లో గిరిజన గ్రామాలకు 14 చెరువులకుగాను సీతంపేట సమగ్ర గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు ఉచితంగా 100 శాతం రాయితీతో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అలాగే సోంపేట మండలం రామయ్యపట్నం గ్రామానికి చెందిన నిట్ట గోపాల్ అనే లబ్ధిదారులకు పిఎంఎంఎస్‌వై స్కీం కింద మూడు చక్రాల లగేజీ వ్యాన్ 40 శాతం సబ్సిడీపై స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు చీకటి శ్రీరాములు, మాజీ జెడ్‌పిటిసి సూరాడ చంద్రమోహన్, సోంపేట మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రవికుమార్, మత్స్యశాఖ సిబ్బంది, జిల్లా మత్స్యకార సహకార సంఘ డైరెక్టర్ బడే తమ్మారావు, ఎఎంసి డైరెక్టర్ సూరాడ ధనరాజ్, సోంపేట, కవిటి మండల సంఘ అధ్యక్షులు, మత్స్యకార నాయకులు, లబ్ధిదారులు, మత్స్యకారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చేప పిల్లలు అందజేస్తున్న విప్ అశోక్

గిరిజన గ్రామాల సరిహద్దు సమస్య పరిష్కరించాలి



పిఒకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- మందస

మందస జూనియర్ కళాశాల గర్ల్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలని, 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం చేయాలని, ఐటిడిఎ భవన నిర్మాణం పూర్తి చేయాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సీతంపేట ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబుకు వినతిపత్రం అందించారు. శుక్రవారం మందసలో జరిగిన గిరిజన దర్బార్‌లో మందస మండలానికి సంబంధించిన అనేక గిరిజన సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్ష, సహాయ కార్యదర్శులు సవర. గురునాథ్, సవర ధర్మారావు, సవర భావన మాట్లాడుతూ మందస మండలంలో మూడు పంచాయతీలకు సంబంధించి ఐదు గిరిజన గ్రామాలైన మాణిక్యపట్నం, మధ్య కళ్లు, దలసరి, కొండమీర, గుడ్డికూడ సరిహద్దు సమస్యలు కారణంగా ఆ గ్రామాల్లో గిరిజన భూములను, చెరువులను, శ్మశానాలను ఒడిశా నుంచి వచ్చినవారు ఆక్రమించుకుంటున్నారని, తమ భూములు ఆక్రమించవద్దు అంటే ఒడిశా ప్రభుత్వం, అధికారులు కేసులు పెడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. మాణిక్య పట్నంలో మంచినీటి బోరు నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు మార్చాలని, భావనాపురంలో తిత్లీ తుఫాన్ కారణంగా వంగిపోయిన విద్యుత్ స్తంభాలు మార్చాలని, బుడంబో నుంచి భావనాపురం వరకు రోడ్డు నిర్మించాలని, శ్మశానాలు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని, మాణిక్య పట్నం, బలి యాసాయి, భావనాపురం అంగన్వాడీ భవనాలు మంజూరు చేయాలని, చిన్న బరంపురం జంక్షన్ నుంచి సింగుపురం వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని వారు డిమాండ్ చేశారు. బుడార్ సింగ్ పంచాయతీని రెండుగా విడగొట్టి ఎస్‌టి పంచాయతీని ఏర్పాటు చేయాలని, బిత్తర బంద గిరిజన గ్రామానికి అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సవర కృష్ణ, సవర జగన్, సవర కైలాస్, సవర కాలింజీ, సవర హరికృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొర, ఎటిడబ్ల్యుఒ మల్లికార్జునరావు, ఎంపిడిఒ వై. వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న విప్ అశోక్

సోంపేట: మండలంలోని కొర్లాం జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ 2026 వార్షిక కేలెండర్‌ను విప్ డా బెందాళం అశోక్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాగృతి సంస్థ సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. నేటి యువత కూడా ఇలాంటి సంస్థలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయాలని ఆశాభావాన్ని వక్తం చేశారు. కార్యక్రమంలో జాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ మనో వికాస నిపుణుడు రాంబుడ్డి గణపతి, ఉప సర్పంచ్ తామాడ వాసుదేవరావు, పెద్దింటి రాజేష్, శివంగి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ రమణ

సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని రావివలస సచివాలయం పరిధిలోని చెత్త సంపద కేంద్రాన్ని డిఎల్‌పిఒ ఐ.వి రమణ శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం వర్మీ కంపోస్టును పరిశీలించారు. తయారైన వర్మీ కంపోస్ట్‌ను రైతులకు అమ్మకాలు జరపాలని సూచించారు. సేంద్రీయ ఎరువులతో పంటలు అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. అందులో భాగంగా క్లాప్‌మిత్రల హాజరు, రికార్డ్స్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పాల రవికుమార్, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో అప్పన్న అరెస్ట్

సంతబొమ్మాళి: మండలం చెట్లతాండ్ర గ్రామానికి చెందిన చెక్క రామారావుపై మారణా యుధాలతో దాడికి ప్రయత్నం చేసిన ఘటనలో కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు చెందిన కింజరాపు అప్పన్నను సంతబొమ్మాళి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అప్పన్న సోదరుని కుమార్తె లహరికి సంబంధించి గతంలో నమోదైన పాత కేసులున్నాయి. దీనిపై డిసెం బరు 31న చెట్ల తాండ్ర గ్రామంలో ఇరువర్గాలు సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా మరోవర్గానికి చెందిన రామారావు అంగీకరించకపోవడంతో అప్పన్న ఆగ్రహానికి గురై మారణాయుధాలతో దాడికి ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంత బొమ్మాళి పోలీసులు కేసునమోదు చేసి నిందితుడిని శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ సింహాచలం తెలిపారు.



సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

బాలికల విద్యకు ప్రభుత్వం పెద్దపీట

పొందూరు: బాలికల విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని లోలుగు వద్ద గల కెజిబివిలో రూ.37 లక్షలతో నూతనంగా నిర్మించిన కంప్యూటర్ రూం, సైన్స్‌ల ల్యాబ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ల్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, బాడాన శేషగిరి, సమగ్ర శిక్ష ఇఇ డి.వి.ఎన్.మూర్తి, జిసిడిఒ సిహెచ్ మాధవి, ప్రిన్సిపాల్ సిహెచ్ లలిత కుమారి, టిడిపి నాయకులు కామరాజు పాల్గొన్నారు.

వీధి రోడ్డు ఆక్రమణ తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

పలాస : కాశీబుగ్గ గాంధీనగర్ మున్సిపల్ వీధి రోడ్డుపై అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు జెసిబి సహాయంతో తొలగించారు. ప్రజాశక్తి దినపత్రికలో జనవరి 1న రోడ్డుపై అక్రమ నిర్మాణం శీర్షికతో వెలువడిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ ఇ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు శుక్రవారం జెసిబి సహాయంతో సుమారు 144 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. మరలా నిర్మాణం చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ ఇ.శ్రీనివాసులు ఆక్రమణ దారులకు హెచ్చరించారు.



అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న అధికారులు

ఐతమ్ అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



గౌతంశ్రీ

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బేసిక్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగ పరిధిలోని కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో రసాయన శాస్త్ర అధ్యాపకులుగా బోధనా విధులు నిర్వహిస్తున్న డా. సత్తారు గౌతంశ్రీ విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టరేట్ (పిహెచ్‌డి) పట్టా ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు తెలిపారు. డా. జయరావ్ పరిశోధన మార్గదర్శకత్వంలో రసాయన శాస్త్ర విభాగంలో "లోహాలు (ఇనుము, కోబాల్ట్, జిర్కోనియం) మిశ్రమం ద్వారా జింక్ ఆక్సైడ్‌లో దృశ్యకాంతి క్రియాశీలత పెంపొందించడం, రంగుల వ్యర్థాల విచ్ఛిన్నం, బ్యాక్టీరియా నిరోధక సామర్థ్యంపై అధ్యయనం' అనే అంశంపై డా. గౌతంశ్రీ పరిశోధన నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా డా.గౌతంశ్రీని ప్రిన్సిపాల్ డా.ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌ఒడిలు డా. రత్నమణి, డా.రమణయ్య, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.



నగదు అందజేస్తున్న సభ్యులు

'మాతృమూర్తి' ఉదారత

ప్రజాశక్తి- కవిటి

మాతృమూర్తి యువజన సేవా సంఘం మరోసారి తన ఉదారత చాటుకుంది. మండలంలో తొత్తిడిపుట్టుగకు చెందిన యువకుడు పొడియా పురుషోత్తం కిడ్నీ వ్యాధితో మరణించడంతో, ఇద్దరు చిన్నారులతో అతని కుటుంబ దయనీయ స్థితి వివరిస్తూ ప్రజాశక్తి డిసెంబర్ 15న కాటేసిన కిడ్నీ వ్యాధి అంటూ కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందిస్తూ కుసుంపురం కేంద్రంగా పనిచేస్తున్న మాతృమూర్తి యువజన సేవాసంఘం సభ్యులు గురువారం సాయంత్రం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పురుషోత్తం భార్య పొడియ జమునను ఓదార్చి తక్షణసాయంగా రూ.5 వేలు అందించారు. అంతేకాకుండా సంఘం గౌరవ సభ్యుడు బత్తిని గోపాలరావు (ఎన్.ఆర్.ఐ) నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మోహన్, చలపతి, ప్రదీప్, రమేష్, బాలక శ్రీను మాస్టర్, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో రైతుల నమోదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్‌లో ఎంపికైన గ్రామాల్లోని రైతుల వివరాలను ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ (డిపిఎం) పూజారి సత్యన్నారాయణ ఆదేశాల మేరకు సిబ్బంది నమోదు చేస్తున్నారని సిడిఎఫ్ చేపేన సురేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎన్ఎంఎంఎఫ్ గ్రామాల్లో డేటా సేకరణతో పాటు ఉర్వి యాప్‌లో నమోదు చేసే ప్రక్రియపై సిడిఎఫ్ సురేష్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఐసిఆర్‌పిలతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి ఖచ్చితమైన డేటాను సేకరించి వారిని ప్రకృతి వ్యవసాయం చేసే దిశగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సేకరించిన డేటాను ఉర్వి యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ జిల్లా ఐసిటి, ఎన్ఎఫ్ఎ శివకృష్ణ పర్యవేక్షణలో కొనసాగుతుందని తెలిపారు. ట్రైనీ ఐసిఆర్‌పిలకు క్షేత్రస్థాయిలో డేటా సేకరణకు అవసరమైన టెక్నికల్ సపోర్ట్‌ను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎంటి రవి, భవానీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

పలాస: విద్యార్థులు చదువుతో పాటు సేవాభావాన్ని కలిగి ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకట లక్ష్మీ అన్నారు. మండలం సున్నాడ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల ఏర్పాటు చేసిన తర్వాత తొలి ఎన్ఎస్ఎస్ శిబిరం అని, ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామంలో వారం రోజుల పాటు శిబిరం కొనసాగు తుందని చెప్పారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.మధు, సున్నాడ గ్రామ మండల ప్రజా మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం మధురావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి బాధ్యత పెంచుతుంది

ప్రజాశక్తి- పలాస



మందస : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ఉద్యోగులకు ఉద్యోగోన్నతి మరింత బాధ్యత పెంచుతుందని, అందుకు అనుగుణంగా మెలగాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న పలాస, వజ్రపుకొత్తూరు మండలాల మినీ అంగన్వాడీ కార్యకర్తలకు పదోన్నతి పత్రాలను ఆమె అందజేశారు. అనంతరం 189 అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలకు సంబంధించి ఫ్రీ స్కూల్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. పిల్లలకు మంచి అలవాట్లు, బుద్దులు, చదువు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ పార్వతి సూపర్‌వైజర్లు యు.లత, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మందస: మండలంలో 34 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలుగా విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ కార్యకర్తలుగా పూర్తి బాధ్యతలకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే గౌతు శిరీషా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధులను అలసత్వం వహించరాదని, పారదర్శకత పాటించాలని, పిల్లల విషయంలో మెరుగైన సేవలను అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి అనుపమ, ఎంపిడిఒ వెంకటరమణ, వెల్ఫేర్ స్టేట్ డైరెక్టర్ దాసరి తాతారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న ఐఎఫ్‌టియు నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని రిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలంటూ శుక్రవారం రిమ్స్ వద్ద ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సెక్యూరిటీ గార్డులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం చట్ట విరుద్ధమన్నారు. జిఒ నంబర్ 138 ప్రకారం సెక్యూరిటీ గార్డులకు నెలకు రూ.18,600 చొప్పున సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ బకాయిలతో పాటు డిసెంబర్ నెల జీతాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 30 మంది పారిశుధ్య కార్మికులకు కూడా వేతనాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టర్లు చట్టాలను ఉల్లంఘిస్తూ కార్మికులను వేధిస్తున్నారని ఆరోపిం చారు. శ్రీకార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్, క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ లిమిటెడ్ యాజమాన్యాలపై ప్రభుత్వం సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి బగాది శ్రీనివాసరావు, పారిశుధ్య కార్మికుల ప్రధాన కార్యదర్శి దమ్ము చిన్నారావు, సాదు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ రత్నం బాలరాజు

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని వైసిపి మండల ఉపాధ్యక్షుడు దున్న రత్నం బాలరాజు అన్నారు. అమలపాడు ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్విజ్ పోటీల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, గుణాత్మక విద్యను వెలికి తీసేది ఉపాధ్యాయులేనన్నారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 3.4,5, 8, 9వ తరగతుల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో 9వ తరగతిలో ప్రదమ బహుమతి నగరంపల్లి కైవశం చేసుకోగా, ద్వితీయ స్థానంలో ఆమలపాడు, తృతీయ స్థానంలో పాతటెక్కలి ఉన్నత పాఠశాలల విద్యార్థులు కైవశం చేసకుకున్నారు. 8వ తరగతిలో ప్రథమ స్థానంలో అమలపాడు, ద్వితీయస్థానంలో నగరంపల్లి, తృతీయ స్థానంలో పెద్దమురహరిపురం ఉన్నత పాఠశాలల విద్యార్థులు కైవశం చేసుకోగా వీరికి బాలరాజు నగదు బహుమతులతో పాటు షీల్డు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రదమ, ద్వితీయ, తృతీయ బహుమతులను మంచినీళ్లపేట, కంబాలరాయుడుపేట, గోవిందపురం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు కైవశం చేసుకున్నారు. వీరికి వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదుతో పాటు, షీల్డులు, ప్రసంశా పత్రాలను ఆయన అందించారు. హెచ్ఎం పోలాకి వాసుదేవ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు ఉన్నత పాఠశాల హెచ్ఎం సాయిరాం, ఎంపిటిసి దున్న లోకనాథం, మాజీ సర్పంచ్ దున్న షన్ముఖరావు, డి.కె.రామారావు, కె.సన్యాసరావు, ఉపాధ్యాయులు కె.నాగేశ్వరారవు, కె.మురళీ, శ్రీనివాసరావు. గ్రామపెద్దలు, విద్యార్థులు, తదితరలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- పొందూరు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ వాసుదేవరావు

గ్రామాల్లో ప్రత్యేకంగా పారిశుధ్య పనుల నిర్వాహణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు అన్నారు. మండలం రాపాకలో సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామాలయం వెనుక, రజకవీధితో పాటు ఎస్‌సి కాలనీలో మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, పిచ్చిమొక్కల తొలగింపును పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈయనతో పాటు కార్యదర్శి భానుప్రకాష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రాపాకలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

పొందూరు: మండలంలోని రాపాకకు చెందిన పోలీస్ కానిస్టేబుల్స్ ఆధ్వర్యంలో ఈనెల 12న జిల్లాస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో ప్రదమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన టీంలకు బహుమతులను ప్రధానం చేయను న్నారు. టీంకు ఐదుగురు సభ్యులు మాత్రమే అనుమతి గలదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన టీం సభ్యులకు చార్జీలతో పాటు, భోజనం, టిఫిన్, స్టేషనరీ ఖర్చులను కమిటీ సభ్యులు చూసుకోవడం జరుగు తుందన్నారు. ఈ క్విజ్ పోటీల్లో చరిత్ర, జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, అర్థమ్యాటిక్, జనరల్ నాలెడ్జ్, పాలిటీ, ఎకానమీల సిలబస్‌పై ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ఎంట్రీ ఫీజు లేదని, టీంలు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఈనెల 10లోగా ఈ కింది ఫోన్ 9949689687 నంబర్‌ను సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

అందుబాటులో ఎరువులు

మెళియాపుట్టి: ప్రస్తుతం రబీలో పండిస్తున్న పంటలు మొక్కజొన్న, వరి, చోడి, పొద్దుతిరుగుడు రైతులకు అవసరమైన ఎరువులు మండల కేంద్రంలో లభ్యంగా ఉన్నాయని ఎఒ దానకర్ణుడు శుక్రవారం తెలిపారు. రైతుసేవా కేంద్రం కరజాడ, పిఎసిఎస్ కోసమాల (గోకర్ణపురం), శ్రీ శ్రీనివాస ఫెర్టిలైజర్స్, సాయిబాలాజీ ట్రేడర్లు, యురియా 30 టన్నులు లభ్యమంగా ఉందన్నారు. అవసరమైన రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ఎరువులను పొందాలన్నారు. ఈ సందర్భంగా ఎఒ సాయి బాలాజీ ట్రేడర్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని, అలాగే రోజువారి ఎరువుల అమ్మకాలు, లభ్యత వివరాలు, స్టాకు బోర్డు, స్టాక్ బుక్‌లో పొందుపర్చాలన్నారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎఒ దానకర్ణుడు

స్పీడ్ స్కేటింగ్‌లో విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం



స్పీడ్ స్కేటింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు

ఇటీవల జరిగిన స్పీడ్ స్కేటింగ్ పోటీలో అత్యుత్తమ ప్రతిభ చూపించి అనేక పతకాలు సాధించిన విద్యార్థులకు విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి అభినందించారు. జిల్లా స్థాయిలో జరిగిన స్పీడ్ స్కేటింగ్‌లో స్వర్ణభారతి విద్యా సంస్థల నుంచి మెత్తం 15 మంది విద్యార్థులు పాల్గొనగా 26 మెడల్స్, సర్టిఫికెట్లు సాధించారు. ఇందులో 10 గోల్డ్, 10 సిల్వర్, 6 బ్రాంజ్ మెడల్స్ సాధించడంపై విద్యాసంస్థల అధ్యక్షులు చాట్ల తులసీదాస్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన విజేతలకు ఈ నెల 10, 11 తేదీల్లో తిరుపతిలో రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్‌లో పోటీ పడుతున్నారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న పదిమంది విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం కోచ్ బి.చంద్రావతి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, సెక్రటరీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ రామకృష్ణ

ప్రజాశక్తి- పలాస

ఆర్‌టిసి బస్సులు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని కాశీబుగ్గ సిఐ వై. రామకృష్ణ అన్నారు. స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద శుక్రవారం ఆర్‌టిసి వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు, కండక్టర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులు నడిపే సమయంలో ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. బస్సులు నిలిపే ప్రాంతంలో, ప్రయాణికులు ఎక్కి, దిగే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చున్నారు. ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలన్నారు. చిన్న చిన్న విషయాలను పట్టించుకోకుండా ముందుకు వెళ్ళినప్పుడే ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్యాం సుందర నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ కరుణ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గురుగుబిల్లి గ్రామంలో సర్పంచ్ బాడిత కళ్యాణి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామంలోని వీధుల్లోని కాలువల్లో పూడికలు తొలగించడం, సిసి రోడ్లు శుభ్రం చేయడం, తొలగించడం వంటి పనులు చేపడుతున్నారు. ఈ పనులను సర్పంచ్ ప్రతినిధి లక్ష్మణరావు, కార్యదర్శి దగ్గరుండి పర్యవేక్షించారు.



గురుగుబిల్లిలో చేపడుతున్న పారిశుధ్య పనులు

లైంగిక వేధింపులు నివారించాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సమాజంలో మైనర్ బాలురు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపిడిఒ ఎం.పావని, మండల వైద్యాధికారి ఎస్.సాహితీ ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో లైంగిక వేధింపుల నివారణ, బాల్య వివాహాల నిరోధం, బాలల హక్కుల చట్టాలు, పోక్సోచట్టం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైంగిక వేధింపులకు పాల్పడిన వారితో పాటు వాటిని ప్రోత్సహించిన వారిపై కూడా కఠిన చర్యలు, శిక్షలు అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ ఎం.గీత, సబ్ ఇన్‌స్పెక్టర్ బి.హైమావతి, వైద్యాధికారి జ్యోతిర్మయి, ఎంఇఒ కె.శ్రీనివాసరావు, పిహెచ్ఒ మోహనరావు పాల్గొన్నారు.

'కోట'కు జర్నలిస్టుల అభినందన

ఆమదాలవలస: వైసిపి సీనియర్ నాయకుడు, జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావును ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జర్నలిస్టులు అభినందించారు. ఇటీవల ఆమదాలవలస ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు, ఇతర జర్నలిస్టులు కోట గోవిందరావును సాలువతో సత్కరించి మెమొంటోను అందజేశారు. గోవిందరావు మాట్లాడుతూ పాత్రికేయులు చేసిన సత్కారంపై హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయుల పాత్ర కీలకమని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గురుగుబెల్లి రమణారావు, ఉపాధ్యక్షుడు తాండ్ర అప్పలనాయుడు, కార్యదర్శి అన్నెపు మోహనరావు, కోశాధికారి దుర్గారావు, ట్రెజరర్ ఐ న్యూస్ వాసు, గౌరవ అధ్యక్షుడు గురుగుబెల్లి ప్రసాదరావు, సీనియర్ జర్నలిస్టులు వై.శ్రీనివాసరావు, కె.వి. రమణ, ఎ.శంకర్, బొడ్డేపల్లి అప్పలనాయుడు, చంటి శర్మ పాల్గొన్నారు.